# మళ్ళింపు

ఇంద్రగంటి జానకీబాల



నేను ఉలిక్కిపడి లేచాను. అంతా నిశ్శ
బ్దంగా వుంది. రివ్వున తిరిగే ఫ్యాను
శబ్దం ...టిక్ టిక్ మంటున్న గడియారం.
మళ్ళీ తలుపుమీద ఎవరో కొట్టిన శబ్దం.

మంచంమీంచి లేచి లైటు వేశాను. రా
ఒంటిగంటైంది. శ్రీలేఖ ఆదమరచి ని
పోతోంది. బాబు దూరంగా జరిగి మం
మీంచి కిందపడేలా వున్నాడు. పా

మంచం మధ్యగా జరిపి ముందుగదిలోకి వెళ్ళాను.

"ఎవరూ" అన్నాను.

"నేనే"—

రాజు కంఠం నాకెప్పుడూ గుర్తే. చటుక్కున తలుపు తీశాను.

ఎదురుగా రాజు చిన్న బ్యాగ్‌తో నిలబడి వున్నాడు.

"అరే, ఇంత అర్ధరాత్రి దిగావేమిటి? ఎక్కడినుంచి" అన్నాను.

"హైద్రాబాద్‌నుంచి" అంటూ లోపలికొచ్చాడు. అతన్ని చూసి ఒక్కక్షణం ఆశ్చర్యపోయాను.

బాగా చిక్కిపోయాడు. గడ్డం పెరిగి వుంది. అలసటగా వున్న కళ్ళల్లో నిద్రలేమి వల్ల ఎర్ర జీరలు. సూర్యాస్తమయ సమయంలో నీలాకాశంలో మబ్బుల చాటునుంచి చెదిరిన కిరణాల రేఖల్లా వున్నాయి. ముఖమంతా పీక్కుపోయినట్లుంది.

"వదిన నిద్రపోతోందా" అన్నాడు.

"అర్ధరాత్రి నిద్రపోక ఏం చేస్తారు" అని నవ్వాను.

"ఏమిటి విశేషాలు, ఎన్ని గంటలకి బయలుదేరావ్?"

"సాయంత్రమే బయలుచేరాను. బస్సు ఫెయిలయి లేటయింది."

"ఏమైనా తిన్నావా"

"మధ్యలో భోజనం చేశాను" అన్నాడు కాని నాకు నమ్మకం కుదరలేదు. అయినా ఆ సమయంలో బలవంతం చెయ్యదల్చుకోలేదు. రాజు నాకు సొంత తమ్ముడు కాకపోయినా అంతకంటె ఎక్కువగా వుంటాడు. నన్ను అన్నయ్యా అని పిలవడు కిరణ్ అనే అంటాడు. శ్రీలేఖని వదిన అంటాడు. తేలగ్గా, దాపరికం లేకుండా వుండే రాజంటే నాకెంతో యిష్టం. మా కలయిక, స్నేహం ఎప్పటినుంచి అంటే తేదీలు, వారాలు చెప్పలేముగాని చాలా కాలంగా మేము మిత్రులం. వాడు చేసే కొన్ని పనులు చికాకు కలిగించినా, వాడిమీద ప్రేమ చెరిగిపోదు, ఆప్యాయత అణగారిపోదు. "పడుకో, అలసిపోయినట్లున్నావ్" అన్నాను బద్ధకంగా ఆవలిస్తూ—

"లేదు. నిద్రపోవటానికి రాలేదు. నీతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడదలచి వచ్చాను" అన్నాడు గంభీరంగా.


నేను ఆశ్చర్యపోయాను. అర్ధరాత్రి దిగిన వెంటనే ఏదో చెప్పాలంటున్నాడంటే ఏదో వుందనిపించింది. నా భావాలు బయటికి కనిపించకుండా—వాడిపక్కనే సోఫాలో కూర్చుంటూ

"రేపు మాట్లాడుకోకూడదూ" అన్నాను భుజంమీద చెయ్యి వేసి—నాకు యింకా బద్ధకం వదల్లేదు. రాజు నా వొళ్లో తల దాచుకొన్నాడు ఏడుస్తున్నట్లు అనుమానం వేసింది నాకెలాగో అనిపించింది. ఒక మగాడు మరొక మగాడిదగ్గర అంత తేలిగ్గా ఏడ్వడం కొంచెం యిబ్బందిగా అనిపించింది కాని వాడి స్థితికి చలించిపోయాను. ఎంతో బాధ, లోపల యిముడ్చుకోలేని ఆవేదన వున్నాయని గ్రహించాను. నిశ్శబ్దంగా వాడిని వూరడించాను. ఇద్దరం మూడో అంతస్తుపైకి, డాబామీదకి వెళ్ళాం,- అమావాస్య వెళ్ళిన తొలిరోజులు—అర్ధరాత్రి దాటిన సమయం—వెన్నెలకాని మసక వెలుగు వ్యాపించి వుంది—నలుపు, నీలం కలిసి ఆకాశం విరిగిన పాలు పోలకబోసినట్లుంది. గాలిలో సన్నగా చలి కలిసి, హాయిగా వుంది. నాలుగు గోడల మధ్య ఫ్యానుగాలిలోంచి ఆరుబయట కొస్తే ఎ.సి లోకి వచ్చినట్లుగా అనిపించింది. నాకు నిద్రమత్తు వదిలింది. రాజు చెప్పబోయేది ఏమైనా వినాలని సిద్ధంగా వున్నాను. ఇద్దరం పిట్టగోడమీద కూర్చున్నాం.

రాజు నిశ్శబ్దంగా సిగరెట్ కాలుస్తూ కూర్చున్నాడు.

"ఊఁ - చెప్పు" అన్నాను.

నాకేసి నిశితంగా చూస్తూ "నేను ఒక అమ్మాయిని ప్రేమించాను" అన్నాడు.




అది అంత అనూహ్యమైన విషయం కాకపోయినా కొంచెం వులిక్కిపడ్డాను. నా నరాల్లోంచి రక్తం వేగంగా ప్రవహిస్తున్నట్లనిపించింది—

రాజు చెప్పడంలో కనబరిచే దర్పం, ఆర్టిఫిషియాల్టీ, ఏోజూ నాకొంచెం చిరాకు కలిగించినా సరిపెట్టుకుని వూరుకున్నా.

"భేష్ బాగుంది. ఆలస్యమెందుకు?" అన్నాను.

"దేనికి ఆలస్యం" ఎదురు ప్రశ్న వేశాడు.

"పెళ్ళికి" అన్నాను.

"అదంత సులభంగా జరిగేది కాదు" అన్నాడు విషాదంగా ముఖం పెట్టి.

"ఏం? కుల మతాలా" అన్నాను.

నేను అనుకోకపోయినా కొన్ని విషయాలు మాట్లాడుతుంటే నా కంఠస్వరం వ్యంగ్యం ధ్వనిస్తుందేమోనని నాకే అనుమానం వేస్తుంటుంది. ఎన్నోసార్లు సరిదిద్దుకోవాలని అనుకుంటూ వుంటాను—అది నా స్వభావం? అందుకే దిద్దుకోలేకపోతున్నాను. ముఖ్యంగా ఈ ప్రేమ వ్యవహారాలంటే నాకు పరమ అసహ్యం, చిరాకు. మనుషుల్లో మానసిక బలహీనతల వల్ల వచ్చే రోగాల్లో ప్రేమ ఒకటని నేను పూర్తిగా నమ్ముతాను. ప్రేమించటం, వాళ్ళకోసం విరహ ముఖంపెట్టి కూర్చోడం, వాళ్ళ కోసం గడ్డాలు పెంచడం, తాగిపడిపోవడం లాంటివి నాకు మరీ అసహ్యం కలిగిస్తాయి. అందుకే ఆ మాటలొస్తే నాలో హేళన, వ్యంగ్యం తలెత్తుతాయి.

ఒక్క నిమిషం నిశ్శబ్దంగా వూరుకుని "ఆమెకి యింతకు పూర్వమే పెళ్ళయింది" అన్నాడు తాపీగా—

నా పక్కలో బాంబు పేలినట్లు వులిక్కిపడ్డాను. ఇది పూర్తిగా వ్యతిరేకించే విషయం నాకిలాంటి సమస్యలంటే మరీ చిరాకు,

"అయితే ఇంక ప్రేమేమిటి" అన్నాను.

"ఏం ఎందుకుండకూడదు? పెళ్ళయితే ప్రేమించటానికి అర్హత కోల్పోతారా?" అన్నాడు.

నాలో కోపం చర్రున లేసింది, "పిచ్చిగా మాట్లాడకు, జీవితాల్లో సమస్యలు సృష్టించుకొని, అశాంతిపాలై అదేదో ప్రేమో, దోమో అనడం నాన్సెన్స్" అన్నాను దురు

సుగా,

రాజు కాస్త డల్ అయ్యాడు. నెమ్మదిగా అన్నాడు. "అంతే కాదు ఆమెకి ఇద్దరు పిల్లలు వున్నారు" అని

ఈసారి నేను షాకై పోయాను, ఒళ్ళు మండిపోయింది. సాచి లెంపకాయ కొట్టాలన్నంత కోపమొచ్చింది. తమాయించుకున్నాను, అయినా అందులోంచి రాజు సంస్కారమేదో లాగలని "విడో నా" అన్నాను.

"కాదు" అన్నాడు తలొంచుకుని—

నాకు మొట్టమొదటిసారిగా రాజుఅంటే ఎక్కడలేని అసహ్యం, ఏవగింపు కలిగాయి. వెంటనే నేనేమీ మాట్లాడలేకపోయాను. అతనివంకే పరీక్షగా చూస్తూ కూర్చున్నాను. నా మనోభావాలు చదవగలిగిన రాజు నిట్టూర్చి

"నన్నీ ప్రపంచంలో ఎవరూ అర్థం చేసుకోలేదు" అన్నాడు విరక్తిగా:

నాకు వాణ్ణిచూస్తే ఎంతో జాలేసింది. ఎంతో కొంత బాధా ఆవేదనా, తెగని సమస్య పెట్టుకుని నాకోసంవచ్చాడు, వాణ్ణి సముదాయించడం, వాడి కష్టంలో పాలు పంచుకుని, ఓదార్చడం, పరిష్కరించడానికి ప్రయత్నంచెయ్యడం నా కనీసధర్మం అనుకుని నన్ను నేను తమాయించుకుని

"అసలు సంగతేమిటి" అన్నాను.

నేనిచ్చిన మాట ఆసరాకి రాజు ధైర్యాన్ని కూడతీసుకుని.

"ఆమె కిద్దరు పిల్లలు, ఆమె లేనిదే నేను బ్రతకలేను. ఆమె కూడా అంతే, ఆమెకి భర్తంటే అసహ్యం—కాని పిల్లలు కావాలి- నేనామె పిల్లల్ని ఎంతవరకు భరించగలనో తేల్చుకోలేకుండా వున్నాను ఆమెమాత్రం నాతో నరకానికైనా రావడానికి సిద్ధంగా వుంది-, ఆమెకీ నాకూ విడదీయరాని మానసికానుబంధం ఏర్పడింది. బహుశ అది ఈ జన్మదికాదేమో, ఎన్నో జన్మల అనుబంధం కావచ్చు" అన్నాడు భావుకతలో తేలిపోతూ-

"ఛట్, నాన్సెన్స్-పిచ్చికబుర్లు, జన్మజన్మల అనుబంధాల సినిమాకబుర్లు చెప్పకు. నాకున్న కాస్త ఓర్పు నశిస్తుంది, విషయం చెప్పు" అన్నాను కటువుగా.

"ఏముంది చెప్పడానికి" అంటుంటే రాజు కళ్ళల్లో నీరు తళుక్కుమంది. అంత గంభీర వాతావరణంలోనూ నాకు నవ్వొచ్చింది, కాని ఆ క్షణంలో నేను నవ్వితే రాజు ఆ మూడో అంతస్థు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటాడేమోనని ఆపుకున్నాను.

"అసలేం జరిగిందో చెప్పు" అన్నాను

రాజు చెప్పడం మొదలుపెట్టాడు—

"నాకు మెలకువ వచ్చేసరికి బాగా పొద్దుపోయింది కళ్ళు మంటలుగా వున్నాయి. మంచం మీంచి లేవబుద్ధి కాలేదు. బద్ధకంగా పడుకునే వుండిపోయాను రాత్రి రాజు చెప్పిన విషయాలు ఒక్కొక్కటీ జ్ఞాపకం రావడం మొదలుపెట్టాయి కొత్త కథేమీ కాదు. అందమైన ఆమెతో పరిచయం—ఎవరో ఏమిటో తెలీకుండా తొలిచూపులో ప్రేమించేయడం, దాని ఆమె **recepro-cate** చెయ్యటం—ఆ తర్వాత ఆమెకి భర్తంటే యిష్టం లేదని, ఆమె అతని దగ్గర నానా అవస్థలు పడుతున్న వైనం—ఎలాగైనా తనదానిగా చేసుకోటానికి రాజు పడే ఆరాటం—ఒక్కొక్కటీ చిత్ర విచిత్రమైన రంగులతో నాకళ్ళముందు కదలటం మొదలుపెట్టాయి.

ఈ పెళ్ళి అనేమాటకి అర్థం ఏమిటి? ఇద్దరు వివాహం చేసుకున్నాక అభిప్రాయాలు కలవక పోతే? ఇష్టం ఏర్పడక పోతే విడిపోవడమేనా? ఇలాంటి అవకతవక అనుబంధాలు పెంచుకుని జీవితాన్ని నాశనం చేసుకోవడమేనా? వారిమధ్య పసి హృదయాలు నలిగి నాశనమవడమేనా? అసలు భార్యాభర్తల మధ్యనే కాదు. ఏ యిద్దరి వ్యక్తుల మధ్యనైనా ఏకాభిప్రాయాలు వుంటాయా? ఏవో కొన్ని కలుస్తాయి. ఎన్నో భేదాభిప్రాయాలుంటాయి

ఇద్దరి ఆఫీసర్ల మధ్య, ఇద్దరు మినిష్టర్ల మధ్య—ఇద్దరి డాక్టర్ల మధ్య—మరిద్దరు వుపాధ్యాయుల మధ్య, అక్కా తమ్ముళ్ళ మధ్య—తండ్రీ కొడుకుల మధ్య, తల్లీ కూతుళ్ళ మధ్య, ఏ యిద్దరి మధ్య మాత్రం అంత విడదీయరాని పొత్తు వుంటుంది? అయితే ఏ యిద్దరిలో ఎలాంటి భేదాభిప్రాయాలున్నా ఫర్వాలేదు. కాని భార్యాభర్తల మధ్య వుండకూడదు. వుండటానికి వీల్లేదు. ఎంత అసంభవం? ఎంత దురదృష్టం—, వారిద్దరిమధ్య ఏ గొడవలున్నా అవి లోకానికి కావాలి, అందులో ఎందరో కొందరు తలదూర్చాలని వాటిని ఆసరాగా చేసుకుని తమ స్వలాభం చూసుకోవాలని వేచివుంటారు.

ఆలోచనల్లో సతమతమైపోయాను. నా పడకగది తలుపు ఓరగా వేసి వుంది. ఆ సందులోంచి శ్రీలేఖ సన్నంగా, నాజూకుగా ఎంతో అందంగా కనిపిస్తోంది. డైనింగ్ టేబుల్ మీద ఏవో సర్దుతోంది నాభార్యగా కాకుండా చూస్తుంటే, ఒక పిల్లాడు పుట్టినా ఆమెలో అందం ద్విగుణీకృతమైందేగాని, తగ్గలేదు. ఈమెలో వున్న ఏ కొన్ని అసంతృప్తులనో ఆసరాగా చేసుకుని, ఆమెని ఎవరైనా వక్రమార్గం పట్టిస్తే? ఈమె నా శ్రీలేఖ నాక్కాకుండా, నా బాబుకి లేకుండా ఎక్కడికో- ఏ దూరంతీరాలకో వెళ్ళిపోతే- ఆ ఊహ నాగుండెను చురుక్కుమని కాల్చింది.

ఒక్కసారివులిక్కిపడి లేచికూర్చున్నాను. అదే సమయానికి శ్రీలేఖ లోపలికొచ్చింది. నవ్వుతూ, ఆప్యాయంగా నా దగ్గరకొచ్చి

"ఏమిటా నిద్ర, ఎంత టైమయిందో తెలుసా, రాత్రంతా కబుర్లే అనుకుంటా- లేవండి, అరగంటలో తెమలాలి ఆఫీసుకి" అంది నా భుజంమీద తడుతూ-

ఇందాకటి నా పైశాచికమైన ఊహ పటాపంచలైంది-

లేస్తూనే గడియారంకేసి చూశాను తొమ్మిదిన్నర-చకచకా నాపనిలోపడ్డాను.

గ్యారేజులోంచి కారు తీస్తుంటే నాతో కూడ వచ్చింది శ్రీ.

"రాజు ఇంతవరకు లేవలేదు" అంది. నేను మాట్లాడకుండా వూరుకున్నాను అమాయకంగా, నిష్కపటంగా వున్న శ్రీలేఖ ముఖం చూస్తే నాకెంతో సంతోషం కలిగింది. నేనెంతో అదృష్టవంతుణ్ణి అనుకున్నాను కారుతో గేటుదాకా వచ్చి.

"త్వరగా వచ్చేయండి సాయంత్రం అంతా ఎక్కడైనా వెళ్దాం" అంది నన్ను సాగనంపుతూ.


"ఓ. కే-" అన్నాను నా కారు స్పీడందుకుంది. నా మనసునంతా రాజు సమస్య చుట్టేసివుంది ఒక్కొక్క క్షణంలో చిరాకుగా వుంది. మరో క్షణంలో జాలేస్తోంది. కొంచెం ఆలోచిస్తే, రాజునెలా రక్షించాలా అని భయం వేస్తోంది వదిలేస్తే రాజు గాలివాటుకి కొట్టుకుపోయి ఏమైపోతాడా అని బెంగేస్తోంది- మనసంతా కలగాపులగంగా అయిపోయి అశాంతిగా వుంది.

ఆఫీసుల్లో ఏవో కొన్ని ముఖ్యమైన కాగితాలు మాత్రం చూశాను. నిజానికి రాజు సమస్యని నేనేవిధంగానూ పరిష్కరించలేను. నోరుమూసుకుని ఆ విషయం మర్చిపొమ్మంటే వొప్పుకోడు. తాను సారథ్యం వహించి చెయ్యాల్సినంత గొప్పపనేం కాదు ఇది. పైగా చాల న్యూనతగా, అవమానంగా అనిపిస్తోంది. నామనసుకి ఏమాత్రం నచ్చని విషయానికి నేనే విధంగా మద్దతు ఇవ్వగలను?—

అనుకున్న దానికంటె ముందుగానే యింటికొచ్చేశాను. నాకు గుమ్మంలో శ్రీలేఖ ఎదురైంది.

"రాజుకి వొళ్ళు తెలియని జ్వరంగా వుంది, మూసిన కన్ను తెరవలేదు" అంది గాభరాగా.

నేను బట్టలైనా మార్చుకోకుండా రాజు పడుకున్న గదిలోకి వెళ్ళాను. అతని ముఖం మరీ ఎర్రగా కందగడ్డలా వుంది. నుదుటిమీద చెయ్యివేశాను. పేలిపోతోంది. ఒక్క-




సారి నా హృదయం జాలితో చలించి పోయింది. దుఃఖం గుండెలో గుబగుబ లాడింది. నాకన్నకొడుకు యిలాంటి అర్థ రహితమైన సమస్యలతో సతమతమవు తుంటే ఏం చేస్తాను?—అని ప్రశ్నించుకని—

ఎలాగైనా కాపాడుతాను—అనుకున్నాను. ఇది నాకొక సవాల్ అనిపించింది.

డాక్టరు వేణుగోపాలరావు నాకుమంచి మిత్రుడు, మేమిద్దరం కలిసి ఇంటర్ చదువుకున్నాం. అదీకాక ఇద్దరం ఒకే వూళ్లో స్థిరపడటంతో మా స్నేహం వృద్ధి అయింది. అతనికి స్నేహితులంటే ప్రాణం. స్నేహానికి ఎంతో విలువ ఇస్తాడు, స్నేహం కోసంతన గుండెతీసి చేతిలో పెట్టమన్నా పెడతాడు.

వెంటనే రాజుని తీసుకుని వేణు దగ్గరకి వెళ్ళాను—ఈ మధ్య మేమిద్దరం కలసిచాలా కాలమైంది. నన్ను చూసి ఎంతో ఆనంద పడిపోయాడు. రాజుకి జ్వరం చూసి, మందులురాసి, ఇంజక్షన్ కూడా చేశాడు.

నేనింక వెళ్ళిపోదామనుకుంటే "పేషెంట్లు ఎక్కువలేరు ఒక అరగంటలో అయిపోతారు. వుంటావా, కలిసి చాలా రోజులైంది" అన్నాడు.

అతనా మాటలు అంటుంటే నా మనసులో చిత్రమైన ఊహ తళుక్కుమంది నాకలాంటి మంచిమిత్రుడున్నందుకు ఆనందం వేసింది:

"డోంట్ వర్రీ. నాకార్లో రాజుని యింటి దగ్గర దింపేసి రమ్మంటాను" అని డ్రైవర్ని పిలిచి చెప్పాడు.

నేను రాజుదగ్గరకెళ్ళి "ఒక గంటలో వస్తాను నువ్వెళ్ళి rest తీసుకో" అన్నాను.

అక్కడున్న మెడికల్ మేగజైన్లు తిరగేస్తూ కూర్చున్నాను. అది వేరొక ప్రపంచం. అందులోనే నిరంతరం ఈదుతూ, అప్పుడప్పుడు ఈ మరో ప్రపంచపు గట్టు మీద కాస్సేపు సంచరిస్తారు డాక్టర్లు అనిపించింది.

వేణు పని ముగించుకుని వచ్చాడు. ఇద్దరం అతని ప్రైవేట్ రూమ్‌లోకి వెళ్ళి కూర్చున్నాం—అతను కాస్సేపు తన రొటీన్ గురించి చెప్పాడు. పాలిటిక్స్ గురించి, కాలేజీ సీట్ల గురించి ప్రవాహంలా మాట్లాడేస్తున్నాడు—నేనూ మాటకారినైనా ఆరోజు ఎందుకో ఎక్కువ ఉత్సాహంగా మాట్లాడలేక పోతున్నాను. వేణు రెండు మూడు సార్లు అదే అన్నాడు. "ఎందుకింత డల్‌గా ఉన్నావు? వంట్లో బాగుండటం లేదా?" అన్నాడు చివరికి. నేను నవ్వాను. "సిన్సైన డాక్టరు వనిపించుకున్నావు" అన్నాను.

"లేకపోతే ఏమైనా అనుమానముందా?" అన్నాడు. నెమ్మదిగా రాజు విషయం చెప్పడం మొదలుపెట్టాను. అతను నేనూహించినంత ఆశ్చర్యపడలేదు. ఇలాంటివి సహజమేనన్న ధోరణిలో వున్నాడు. నాకున్న అభిప్రాయాన్ని జోడించి

చెప్పాను. వేణు నవ్వి

"నీకళ్ళతో విషయం చూస్తే, అర్థం లేనిదిగా వుంటుంది. అందులో ఇరుక్కు పోయినవారి బాధ మనం చెప్పలేం—" అన్నాడు "అది సరే కాని నేనొక్క అభ్యర్థన చెయ్యబోతున్నాను—నువ్వు నాకు సహాకరిస్తావా" అన్నాను.

"దేన్నికైనా నేను సిద్ధమే—ఈతుణంలో తిరుపతిలో పెళ్ళి చేద్దామన్నా నేను రెడీ" అన్నాడు.

"దేవస్థానాలు అపవిత్రం చెయ్యడమెందుకులే. అసలు నాప్లాను విను" అని మొదలు పెట్టాను. నేను చెప్తున్నంతసేపు భయపడుతూనే వున్నాను అంతా వినేసి పగలబడి నవ్వుతాడేమోనని,

అయితే వేణు నవ్వలేదు. గంభీరంగా వూరుకున్నాడు—

ఇద్దరం అయిదు నిముషాలు నిశ్శబ్దంగా ఆలోచిస్తూ కూర్చుండిపోయాం—,

ఓ.కే," మిగిలిదంతా, నేను చూసుకుంటాను" అన్నాడు ఒక్కసారి నిద్రలోంచి మేలుకన్నట్లు.

"సో! ఐ విల్ మీట్ యు టుమారో" అన్నాను.

ఆ జ్వరం నాలుగు రోజులకి గాని తగ్గలేదు. రాజు మరీ చిక్కి శల్యమైపోయాడు. ఆ సాయంత్రం నేను రాజుని తీసుకొని వేణు దగ్గర కెళ్ళాను వేణు మళ్ళీ రాజుని పరీక్ష చేసి—ప్రశ్నల వర్షం కురిపించటం మొదలు పెట్టాడు—నేను చెవులు అటువైపే వేసి, ఏదో చూస్తూన్నట్లు కూర్చున్నాను.

"చాలా రోజులుగా మీకు సాయంత్రాల వేళ కొంచెం జ్వరం తగులుతోందా"

"ఏమో నేనెప్పుడూ చూసుకోలేదు"

"పోనీ జ్వరం వున్నట్లు ఫీలయ్యారా"

"వుండేదను కుంటాను" అన్నాడు.

"మీకు దగ్గు వస్తూవుంటుందా" వేణు ప్రశ్నకి రాజు చిన్నగా నవ్వి

"నేను చైన్‌స్మోకర్ని. నాకు దగ్గువస్తే ఆశ్చర్యమేముంది" అన్నాడు.

"ఆశ్చర్యం లేదు. ఆపద వుంది" అన్నాడు వేణు సీరియస్‌గా-

నాకొక్కసారి కోపం వచ్చింది.

"రాజూ-నువ్వేం చంటి పిల్లాడివి కాదు. అడిగిందానికి సరిగ్గా సమాధానం చెప్పడం నీ బాధ్యత" అన్నాను.

"ఓ కే" అన్నాడు.

వేణు రక్త పరీక్షకి రక్తం తీసుకున్నాడు రేపు X ray తీయాలని చెప్పాడు. నాలుగు రోజులు తన observation లో వుండా లన్నాడు. అతని మాటలు వింటుంటేనే రాజు ముఖంలో ఆందోళన కనిపించింది- అయినా నిర్లక్ష్యంగా

"మీరనుకున్న రోగాలేమీ నాకుండవు" అన్నాడు.

"మంచిదే-అదే కావల్సింది. అయినా మా దగ్గరకొచ్చాక పూర్తిగా మా విధి మేము నిర్వర్తించాలిగా" అన్నాడు— కొన్ని మందులురాసి నాకిచ్చాడు. ఇద్దరం బయలుదేర యింటికొచ్చేశాం-

నేను స్నానంచేసి వస్తుంటే రాజు అద్దం ముందు నిలబడి తన ప్రతిబింబాన్ని పరీక్షగా చూసుకోవడం కనిపెట్టాను. నన్ను దూరంగా చూసి అద్దం ముందనుంచి వచ్చి మంచంమీద వాలిపోయాడు. నాకెంతో జాలేసింది.

o o o

"నాకిలాంటి రోగం వస్తుందని కలలో కూడా అనుకోలేదు" అన్నాడు భయాందోళనలతో.

"అన్నీ మనం అనుకున్నట్లే జరగవు. ముందు ఆరోగ్యం ముఖ్యం" అన్నాను హితవు చెప్తూ.

రాజు దగ్గరనుంచి తలతిక్క సమాధానమేమీ రాలేదు. అతని ముఖం చూస్తే పశ్చాత్తాపంతో వేగి పోతున్నాడని అర్థమైంది. అదే అదననుకొని చిన్న వుపన్యాసం దంచాను - నీ అశ్రద్ధవల్ల, లేనిపోని సమస్యల్ని తెచ్చి పెట్టుకోవడం వల్ల ఇలా జరిగిందని గట్టిగా చెప్పాను.

రాజు రూంలో అన్నీ అతని కోసం ప్రత్యేకంగా అమర్చాము. బాబు చనువుగా రాజు దగ్గరకు వెళ్ళబోయినా అతను బాబుని కనీసం తాకకుండా తిప్పి పంపే వాడు....,

రాజు మూడు వేళలా శ్రీలేఖ యిచ్చిన మందులు, పాలు, గుడ్లు తీసుకుంటున్నాడు. తన మందుల పేర్లు కూడా అడక్కుండా తన మందు తనే అతి శ్రద్ధగా తెల్ల మందు, పచ్చబిళ్ళ, ఎర్ర బిళ్ళ అంటూ వేసుకుంటు న్నాడు - సమయం దొరికి నప్పుడల్లా అద్దంలో చూసుకుంటూ కనిపించేవాడు.

రాజుని మరో నెల్లాళ్ళు వుంచేలా శలవు గురించి మాట్లాడటానికి హైద్రాబాద్ బయలు దేరాను.

రాజు ముఖంలో విరహం తగ్గింది. అతను ఏ విషయం గురించి వూగిపోతూ వచ్చాడో అది వల్చబడింది. ఆ వూపు తగ్గింది - కొన్ని సందర్భాలలో ఒక విషయం గురించి యోచించి యోచించి చివరికి విసుగొచ్చి ఇదంతా ఏమీ జరక్కుండా వుంటే బాగుండునని అనిపిస్తుంది. అతి కష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చి నప్పుడు కొన్ని గంటలు, రోజులు మథన పడ్డాక విరక్తి, విసుగు కలిగి ఆ సమస్య నుండి పారిపో వాలనిపిస్తుంది —

రాజుని నిశితంగా పరిశీలిస్తే అదే స్థితిలో వున్నాడని పించింది. నాక్కావల్సింది కూడా అదే. అందుకే మాట్లాడకుండా వూరుకున్నాను.

నేను హైద్రాబాద్ నుంచి తిరిగొచ్చే సరికి రాజు బాగా కోలుకున్నాడు కాని అతనిలో అనారోగ్య భయం పూర్తిగా పోలేదు. అసలే బేల మనస్తత్వం కలవాడ వడంతో మరీ బెంబేలు పడిపోయాడు—

చూసే వాళ్ళకి అతను బాగానే వున్నా అతనికి మాత్రం సంతృప్తి కలగడం లేదు.

రెండు నెలలు గడిచి పోయాయి. రాజు ఇప్పుడు బాగున్నాడు. వేణు అతనికి జాగ్రత్తలు చెప్పి, మందు లేవో రాసిచ్చాడు. ఆ రోజే నా కేరాఫ్‌కి రాజుని వైజాగ్ వదిలి అయ్యేట్లు ఆర్డరు వచ్చింది - హైద్రాబాద్ వెళ్ళి రిలీవ్ అయి వైజాగ్ వెళ్ళాలి.

రాజు స్వేచ్ఛగా వూపిరి పీల్చుకోవడం నేను గమనించాను. రాజు వెళ్ళిపోతే ఇల్లంతా బోసి పోయింది.

o o o

"నాకెంత పెద్ద పార్టీ యిస్తావో మరి" అన్నాడు వేణు నవ్వుతూ.

"పార్టీ ఎందుకు?" అన్నాను దబా యింపుగా.

"ఎందుకా! లేని రోగానికి వైద్యంచేసి నందుకు" అన్నాడు.

"వెరీ సింపుల్... ఎక్కిళ్ళు వస్తుంటే ఏదైనా షాకింగ్ న్యూస్ చెప్పి, మళ్ళిస్తే అవి పోతాయి - ఇదీ అంతే"

"పైగా మనిషి తనని తను ప్రేమించు కున్నట్లు ఎవ్వరినీ ప్రేమించడు, ఎదుటి వారిని ప్రేమించినా, అందులోనూ స్వార్థం వుంటుంది. ప్రేమించ కుండా వుండలేని మనసుకి ప్రేమించడం సుఖం - ఆ సుఖం కోసం ప్రేమిస్తాడు అంతే" అన్నాడు.

నా వాదం ఎంత తల తిరుగుడుగా వుందో వేణు కనిపెట్టాడు.

"అంత సులువుగా తీసేయకు. అంతా రాజులా వుండరు. అతను సున్నితమైన వాడు, భయస్తుడు. అందుకని నీ ప్లాను నెగ్గింది" అన్నాడు వేణు.

"సరే-లేని రోగానికి మందిచ్చిన ఘనత నీకే దక్కింది"- అన్నాను.

వేణు పకపకా నవ్వేశాడు "ఆ మందులు ఎవరికైనా యివ్వచ్చు, అతనికి మందుల పరిజ్ఞానం బొత్తిగా లేక పోవడం కూడా మన అదృష్టమే" అన్నాడు.

ఆ రోజు రాత్రి నాకు చాల కాలం తర్వాత బాగా నిద్ర పట్టింది.